ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 29 నవంబరు 2024



పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

## ఆదర్శప్రాయుడు పూలే : జేసీ

కడప కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా పూలే అందరికీ ఆదర్శప్రాయుడని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. గురువారం జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జేసీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే వెనుక బడినవర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. అట్టడుగు వర్గాల ప్రజలను దోపిడీ వ్యవస్థ, అంటరానితనం నుంచి విముక్తి చేయడానికి నిరంతరం కృషి చేశాడన్నారు. సమాన హక్కుల కోసం, కుల వ్యవస్థ నిర్మూలనకు, అట్టడుగు వర్గాల విద్యాభివృద్ధి కోసం సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. కుల వ్యవస్థను రూపు మాపాలంటే ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధిచెందినప్పుడే సాధ్యమవుతుందని చెప్పిన సంఘసంస్కర్త పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాసులు, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి కృష్ణయ్య, కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు బ్రేక్

- వికలాంగులకు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు మాత్రమే వెసులుబాటు
- స్టాంపులు, ఎల్‌పీఎం రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్
- నేడో, రేపో జీవో జారీ



కడప కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారులో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్వీర్యం అయింది. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లతో పెద్ద ఎత్తున రాష్ట్ర ఖజానాకు మూల ధనం సమకూర్చే ఈ శాఖను ప్రక్షాళన పేరుతో వైసీపీ చోటామోటా నేతల పాలిటి కల్పతరువుగా మార్చారు. తమకు అనుకూలమైన విధానాలు తెచ్చి, అడ్డగోలు అక్రమ రిజిస్ట్రేషన్లకు ఆజ్యం పోశారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో సగటు మనిషి తినోతినకో సంపాదించుకున్న ఇంటిస్థలాలు, భూములకు కాపలాగా బిక్కుబిక్కు మంటూ కూర్చోవాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు ఒకరిద్దరు చొప్పున సబ్ రిజిస్ట్రార్లు వైసీపీ పెద్దల కనుసన్నల్లో అంటకాగడం, వారు పనిచేసే ప్రాంతాల నుంచే పెద్ద ఎత్తున ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు జరగాయనే విమర్శలు ఉన్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో జగన్ జమానాలో జరిగిన ఎనీవేర్ అక్రమ రిజిస్ట్రేషన్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక నిఘాపెట్టారు. ఇంతవరకు అమలులో ఉన్న ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు బ్రేకు వేశారు. ఇక మీదట 60 ఏళ్లు పైబడిన వారికి, వికలాంగులకు మాత్రమే ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు చేసుకునేలా వెసులుబాటు కల్పించారు. అంతేకాకుండా ఎల్‌పీఎం (లార్జ్ మ్యాప్ నంబరు) ఉన్న భూములకు రిజిస్ట్రేషన్లను పునరుద్ధరిస్తూ ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

### రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంతా గందరగోళం

జగన్ పాలనలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అంతా పారదర్శకం అంటూ బాకా ఊదారు. ఎక్కడో రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో గుట్టుగా జరగాల్సిన స్థిరాస్తుల వ్యవహారాన్ని ఏకంగా తాను తెచ్చిన గ్రామ సచివాలయాలకు పురమాయించారు. ఈ విధానం మిగతా వర్గాలకు కంటిమీద కునుకులేకుండా చేశారు. అంతే కాకుండా స్థిరాస్తుల భద్రతకు భరోసాకు ఉపయోగించే నాన్ జ్యుడీషియల్ స్టాంపులను పూర్తిగా రద్దు చేయడంతో స్థిరాస్తిదారుల్లో ఒకరకమైన నైరాశ్యం నెలకొంది. స్టాంపుల స్థానంలో ఈ-స్టాంపులు తేవడంతో అప్పట్లో వినియోగదారులకు ఆస్తుల భద్రతపై భరోసా కరువైంది. జిరాక్సు ఈ-స్టాంపులపై డాక్యుమెంట్లు రాసుకోవాల్సి రావడంతో జగన్ సర్కారు విధానాలపై వ్యతిరేకత మొదలైందని చెప్పవచ్చు. ఇకపోతే సచివాలయాల పరిధిలో అవగాహన లేని సిబ్బందికి సబ్‌రిజిస్ట్రార్ హోదాను కట్టబెట్టి ఎలాంటి శిక్షణ లేని వీరి చేత ఇందిరమ్మ ఇళ్లు, టిడ్కో, జగనన్న ఇళ్లకు ఒక్క రూపాయితో రిజిస్ట్రేషన్లు చేసి 10 ఏళ్లలోపు ఆ ఇళ్లకు క్లియరెన్స్ ఇచ్చేలా వ్యవహారం నడిపారు. అప్పుడు సచివాలయాల ద్వారా చేసిన రూపాయితో రిజిస్ట్రేషన్లు చెల్లుబాటు కావని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతుండడం గమనార్హం.

### ఎనీవేర్ రిజిస్ట్రేషన్లలో గోల్‌మాల్

స్థిరాస్తులు రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఉన్నా కాలయాపన లేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకునేలా 2014-19లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కార్డు-1.0 టెక్నాలజీతో ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు అమలులోకి తెచ్చారు. ఆ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు జరిగితే రెండు రోజుల వ్యవధిలో స్థిరాస్తి ఉన్న రెండు రిజిస్ట్రేషన్ల శాఖల పరిధిలో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, అప్రూవల్ చేయడం, తప్పుడు డాక్యుమెంట్లు ఉంటే రిజెక్టు చేయడం లేక రీజన్ రాయడం అనే పద్ధతి ఉండేది. కానీ జగన్ సర్కారు 2019లో ఈ పద్ధతికి పాతర వేశారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు కొత్త సాఫ్ట్‌వేర్ ప్రైమ్ 2.0ను తెచ్చారు. అంతకు ముందు వరకు ఉన్న రెండురోజుల విధానానికి స్వస్తి పలికి.. కేవలం గంట వ్యవధిలో రిజిస్ట్రేషన్‌కు అప్రూవల్ చేయడమా? రిజెక్టు చేయడమా లేక రీజన్ రాయడమా అనే విధంగా సాగింది. దీంతో ముందుగానే రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులను ప్రసన్నం చేసుకోవడం, వారికి ముడుపులు, కాదు కూడదంటే రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి పెద్దఎత్తున భూములు కొల్లగొట్టేందుకు వైసీపీ నేతలకు ఈవిధానం ఉపయోగ పడిందంటారు. కేవలం గంట వ్యవధిలో డాక్యుమెంట్ పరిశీలన, ఆ స్థలం నిషేధిత జాబితాలో ఉందా? లేదా అనే విషయాలు తేల్చేకంటే ముందుగా కుదుర్చుకున్న ఒప్పందాలతో ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు ఓకే చేయడంతో కొందరు సబ్ రిజిస్ట్రార్లకు కాసులు కుప్పలు తెప్పలుగా వచ్చాయని అంటున్నారు. శ్రీకాళహస్తి, అనంతపురం, గుంటూరు, తెనాలి, విజయవాడ, అన్నమయ్య, కడప, నంద్యాల.. ఇలా అన్ని జిల్లాల్లో వైసీపీ పెట్టుకున్న సబ్ రిజిస్ట్రార్లతో ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల ద్వారా పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను కొల్లగొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందులో వాస్తవాలు తేల్చేందుకు కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగడంతో తమ కార్యాలయం పరిధిలో కాసులకు కక్కుర్తి పడి ఎక్కువగా రిజిస్ట్రేషన్లు చేసిన సబ్ రిజిస్ట్రార్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

### పాత స్టాంపులు, ఎల్‌పీఎం రిజిస్ట్రేషన్లకు ఓకే

వైసీపీ హయాంలో చేపట్టిన రీసర్వేతో జిల్లాలో 200 గ్రామాల్లో భూములకు సర్వే నెంబర్ల బదులు ఎల్‌పీ నెంబర్లు కేటాయించారు. దీంతో వారికి రిజిస్ట్రేషన్లలో తిప్పలు తప్పడం లేదు. ఇన్నాళ్లుగా ఉన్న ఒకే ఖ ా వి ి ని విభజించడం, ఒక వ్యక్తికి ఎన్ని ఎకరాల భూములు ఉన్నా కూడా భాగ పరిష్కారాలకు తావులేకుండా ఎల్‌పీ నెంబర్లు (లార్జ్ పార్శిల్ నెంబరు) వేయడం వంటి చర్యల వల్ల భూముల రిజిస్ట్రేషన్లకు కొర్రీలు పడ్డాయి. అధికారులకే అర్థంకాని రీతిగా ఈ ప్రక్రియ సాగడంతో కడప నగర పరిధిలోని పబ్బాపురం, మామిళ్లపల్లితో పాటు జిల్లా వ్యాప్తంగా ఎల్‌పీ నెంబర్లతో ఉన్న భూముల రిజిస్ట్రేషన్లు ఆగాయి. కూటమి సర్కారు వీటి రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇన్నాళ్లుగా తమ ఆర్థిక అవసరాలైన పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ఉపయోగపడని భూములతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఆర్థిక వెసులుబాటు కల్పించేలా చంద్రబాబు సర్కారు తీసుకున్న నిర్ణయం ఊరట కల్గించనుంది. అంతే కాకుండా జిరాక్సు తరహాలో ఉండే ఈ-స్టాంపు విధానానికి కూడా మంగళం పాడి స్థిరాస్తిదారులు కోరుకున్న విధంగా పాత పద్ధతిలోనే నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలైంది. ఈ మేరకు త్వరలోనే జీవో వెలువడనుందని అధికారులు పేర్కొన్నారు.

## ప్రొద్దుటూరును కార్పొరేషన్ చేద్దాం

- విలీన ప్రాంతాల ప్రతిపాదనలు పెట్టండి : ఎమ్మెల్యే



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీని స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా చేయడానికి పరిసర గ్రామాల్లోని విలీన ప్రాంతాల ప్రతిపాదనలు కౌన్సిల్‌కు పెట్టాలని ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపాలిటీ నూతన మాస్టర్ ప్లాన్ ఎంత విస్తీర్ణం వరకు చేపట్టారని అధికారులను ప్రశ్నించారు. మాస్టర్ ప్లాన్‌లోని ప్రధానమైన కొర్రపాడు రోడ్డు, మైదుకూరు రోడ్డు నుంచి కోనేటి కాల్వ వీధి వినాయకనగర్ దొరసానిపల్లె రోడ్డు మార్గాన రైల్వేస్టేషన్ వరకు విస్తరణ చేపట్టాలన్నారు. పట్టణంలో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సోములవారిపల్లె, దొరసానిపల్లె, కొత్తపల్లె, గోపవరం, చౌటపల్లె, పెద్దశెట్టిపల్లె పంచాయతీల్లోని ప్రాంతాలను విలీనం చేస్తే ప్రొద్దుటూరు అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంటి పన్ను, నీటి పన్నుల వసూళ్లకు ప్రత్యేక టీంలు వేసి ప్రతిరోజు కలెక్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవలన్నారు. దోమల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై ప్రజారోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షలో కమిషనర్ మల్లికార్జున మున్సిపల్ ఈఈ చెన్నకేశవరెడ్డి, డీఈలు దస్తగిరి, ప్రభాకర్ దాస్, యశోద, ఏఈలు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగరాజుతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ పేరుతో ప్రాణాలు బలిగొంటారా

- డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నిరసన

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శిక్షణ పేరుతో ఉపాధ్యాయుల ప్రాణాలు బలిగొంటారా అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎం.విజయకుమార్, మహేశ్‌బాబు ధ్వజమెత్తారు. గురువారం డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ లీడర్‌షిప్ ట్రైనింగ్ పేరుతో రాష్ట్రప్రభుత్వం, విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ ఏర్పాటు చేసి తీవ్ర వత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. వేసవి సెలవుల్లో ఇవ్వాల్సిన శిక్షణను విద్యాసంవత్సరం మధ్యలో ఏర్పాటు చేయడమే కాక ఉపాధ్యాయులు కచ్చితంగా శిక్షణ పొందాలని అడ్డగోలు నిబంధనలు విధించి వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. దీనిని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరుబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల మృతికి బాధ్యులెవరు : ఎస్టీఎఫ్

శిక్షణలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయుల మృతికి ఎవరు బాధ్యులని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రశ్నించారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఆయన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతూ నవంబరు 5న రత్నకుమార్ అనే ప్రధానోపాధ్యాయుడు శిక్షణలో ఉండగా మరణించాడన్నారు. గురువారం విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన ఉపాధ్యాయుడు చనిపోయాడన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ కార్యక్రమాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌర వా ధ్య క్షులడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా టీచర్లకు జరుగుతున్న రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలను రద్దుచేసి తాలూకా కేంద్రాల్లో నాన్ రెసిడెన్షియల్ పద్ధతుల్లో నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుదందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు

## 12 మంది స్మగ్లర్ల అరెస్టు


- 20 దుంగలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

6

## అభివృద్ధికి నోచుకోని బౌద్ధారామాలు

- అతిథిగృహం ప్రారంభమెప్పుడో...!

6



## జిల్లా సమగ్రాభివృద్ధికి.. ఐదేళ్ల ప్రణాళిక

- ఏటా 15శాతం వృద్ధి చెందేలా లక్ష్యం
- వివిధ రంగాల వారీగా ప్రణాళిక

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి దూరదృష్టి ఎక్కువ. రాబోయే 25 ఏళ్ల వృద్ధిరేటు లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తుంటారు. ఇప్పుడు కూడా స్వర్ణాంధ్ర విజన్-2047 పేరిట యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ఇందులో భాగంగా అధికారులు 2024 నుంచి 2029 వరకు జిల్లా సమగ్రాభివృద్ధికి వివిధ రంగాల వారీగా ప్రణాళిక రూపొందించారు. సుస్థిర అభివృద్ధితో పాటు తలసరి ఆదాయం పెంపే లక్ష్యంగా 15 శాతం వృద్ధిరేటుతో కార్యాచరణ రూపొందించారు.

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం జనాభా 20,60,654 మంది ఉన్నారు. పురుషులు 10,37,867 మంది కాగా, స్త్రీలు 10,22,787 మంది ఉన్నారు. మొత్తం కుటుంబాలు 5,06,456 ఉన్నాయి. ఇందులో గ్రామీణప్రాంతాల్లో 2,33,000, అర్బన్‌లో 2,76,000 కుటుంబాలున్నాయి. ఇక గ్రామాల్లో 60.73 శాతం మంది అంటే 12,51,364 మంది నివసిస్తున్నారు. పట్టణాల్లో 8,09,290 మంది నివసిస్తున్నారు.
ఇక జిల్లా వ్యాప్తంగా చదరపు కిలోమీటరుకు 220 మంది ఉన్నారు. మొత్తం 557 గ్రామ పంచాయతీలున్నాయి. వ్యవసాయం మీద ఆధారపడి 65 శాతం ఉన్నారు. పరిశ్రమలపై ఆధారపడి 27 శాతం ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో తలసరి ఆదాయం రూ.2,984 ఉంది. 2029 నాటికి రూ.4,41,192కి పెంచాలన్నదే ప్రధాన లక్ష్యం. యావరేజ్‌గా 15శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే జిల్లా గ్రాస్ వాల్యు యాడెడ్ జీవీఏ 15 శాతం పెంచాలని నిర్దేశించుకున్నారు.

### ప్రాధాన్య రంగాల నుంచి..

- వ్యవసాయరంగం ద్వారా రూ.16,817 కోట్లు జిల్లా స్థూల ఉత్పత్తిగా ఉంది. అంటే పండిన పంటలు ప్రస్తుత ధర, స్థిరధర అంచనాల ప్రకారం లెక్కించారు. 2029 నాటికి 15శాతం పెంపు సాధించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా వ్యవసాయరంగానికి హార్టికల్చర్ గుండెలాంటిది. ఇక సీఎం చంద్రబాబు కడప జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్నారు. దీంతో ఇక్కడ పండ్లతోటలు ఉత్పత్తుల ద్వారా వృద్ధిరేటు సాధించనున్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇస్తున్నారు. ఇప్పటికే అరటి, జామ, బొప్పాయి, మామిడి, ఇతర పండ్లతోటలు సాగులో ఉన్నాయి.
- గుడ్లు, పాలు, కోళ్లు, మత్స్యశాఖరంగం నుంచి జిల్లా గ్రాస్ వాల్యుయాడెడ్ జీవీఏ బాగా పెరుగుతుందని అంచనా వేశారు.
- ఇండస్ట్రియల్ రంగంలో ప్రస్తుతం 27 శాతం వాటా ఉంది. ప్రస్తుతం రూ.12,975 కోట్ల గ్రోత్ ఉంది. 2029నాటికి రూ.28,950 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. సిమెంటు పరిశ్రమలు, హోటల్స్ రైల్వేస్, రోడ్లు, ట్రాన్స్‌పోర్టు, కమ్యునికేషన్‌ల లబ్ధి ద్వారా వృద్ధి రేటు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. రాబోవు రోజుల్లో సోలార్ ప్రాజెక్టు, కొప్పర్తి పరిశ్రమలు, ఇతర వాటి కారణంగా 30శాతం దాటవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రణాళిక ఏర్పాటు చేశారు. కొప్పర్తిలో కొత్తసంవత్సరంలో మూడు పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. ఇక్కడ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చర్ పరిశ్రమను తొలిదశలో 540 ఎకరాల్లో అభివృద్ధి చేశారు. రెండో దశలో 61.5 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే రూ.45 కోట్లతో డీజీజీ ఎక్స్‌పోర్టు గార్మెంటు పరిశ్రమ, రూ.70 కోట్లతో చానెల్‌ప్లే సౌండ్ సిస్టం పరిశ్రమ, రూ.120 కోట్లతో టెక్నడోమ్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

ఇక నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తిలో 2595 ఎకరాల్లో ఎన్‌ఐసీడీఎల్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీని రూ.1850 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. రోడ్లు, నీరు, పైపులైను, విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. మరిన్ని పరిశ్రమలు వస్తాయి.
- ప్రస్తుతం సర్వీసు సెక్టారు 38 శాతం ఉంది. అది రాబోయే 2029 నాటికి 42 శాతం చేర్చనున్నారు. డిజిటల్ పేమెంట్లు, బ్యాంకు సర్వీసింగ్, ఎల్ఐసీ, రియల్ ఎస్టేట్ తదితర వాటిల్లో అభివృద్ధి ఉంటుంది. ఇలా ప్రధానరంగాల్లో 15శాతం లక్ష్యంగా వృద్ధి రేటు పెట్టుకున్నారు.

## ఆర్థిక క్రమశిక్షణ లేకే సమస్యలు

- పులివెందుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పనులు చేయండి.. బిల్లులు తెప్పిస్తాం: ఎమ్మెల్సీ



పులివెందుల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీలో ఆర్థిక క్రమశిక్షణ కొరవడడంతోనే సమస్యలు ఎదురవుతున్నాయని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీలో పట్టణ సుందరీకరణకోసం వందల కోట్లు ఖర్చుచేశారన్నారు. ఏ పనికి ఎంత ఖర్చుపెడుతున్నారో, ఏం చేస్తున్నారో అనేదే లేకుండా ఇష్టమొచ్చినట్లు పనులు అప్పగించి చేయించారన్నారు. జగనన్న కాలనీలో లబ్ధిదారుల నుంచి రూ.35వేలు వసూలు చేశారన్నారు. ఈ డబ్బులు తిరిగి ఇవ్వాలని రామగోపాల్‌రెడ్డి మున్సిపాలిటీని కోరారు. దీనికి స్పందించిన చైర్మన్ వరప్రసాద్ ఇంటి నిర్మాణం కోసం డబ్బులు వసూలు చేశామన్నారు. దీనిని వెనక్కి తిరిగి ఇవ్వమనడం సిగ్గుచేటుగా ఉందన్నారు. అలాగే రింగు రోడ్డు చుట్టూ ఏర్పాటుచేసిన వీధిలైట్లను ఆర్‌అండ్‌బీ అధికారులు అప్పగించలేదని చైర్మన్ అన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్సీ ఆర్‌అండ్‌బీ వీధిలైట్లను మున్సిపాలిటీకి అప్పగించనపుడు విద్యుత్ బిల్లుల భారం ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో దాదాపు రూ.630కోట్లతో పట్టణ సుందరీకరణ పనులు చేపట్టారుకదా ఈ నిధులంతా సక్రమ పద్ధతిలోనే ఖర్చుచేశారా అని ప్రశ్నించారు. పులివెందుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ 2017లో ఈఈఎస్ఎల్ కంపెనీ పులివెందులలో వీధిలైట్ల నిర్వహణకు అగ్రిమెంట్ చేసుకుందన్నారు. వారికి ఈ ఏడాది నవంబర్‌తో టైం పీరియడ్ అయిపోయిందన్నారు. వారికి 3600 లైట్లు నిర్వహణ అప్పగించామని, అయితే వారు ఈ ఐదేళ్లలో ఒక్కరోజు కూడా పులివెందులలో పనులు చేయలేదన్నారు. దీంతో పులివెందుల మున్సిపాలిటీ ఈఈఎస్ఎల్ కంపెనీకి దాదాపు రూ.45లక్షలు జరిమానా విధించిందన్నారు. ఇదిలా ఉండగా పనులు చేయని కంపెనీకి డబ్బులు చెల్లించాలంటూ ప్రస్తుత ప్రభుత్వం జీఓ ఇచ్చిందని, దీనికి తాము సంతకం పెట్టేది లేదన్నారు. పెండింగ్ పనులు పూర్తిచేయించేందుకు చొరవచూపాలని, ఇందుకు దాదాపు రూ.29కోట్లు అవసరం అవసరం అవుతాయని చైర్మన్ వరప్రసాద్, పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్సీని కోరారు. పెండింగ్ పనులు పూర్తిచేయించండి బిల్లులు మంజూరు చేయించే బాధ్యత మాదని ఆయన అన్నారు.

### పనులు అడ్డుకుంటాం

కౌన్సిలర్ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి అంతా రింగు రోడ్డు లోపలే ఉందని, మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. రోడ్లు, డ్రైనేజీలు అధ్వాన్నంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇపుడు రూ.16లక్షలతో కొత్త పనులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. మంజూరైన రూ.16లక్షలు మా గ్రామాలకు ఇస్తే పనులు చేసుకుంటామని, లేదంటే ఆ నూతన పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

### డబ్బులు లేవనడం సిగ్గుచేటు : ఎమ్మెల్సీ

చిన్నచిన్న పనులు చేయించేందుకు కూడా డబ్బులు లేవనడం, గతం ప్రభుత్వంలో చేసిన తప్పులను ప్రస్తుత ప్రభుత్వంపై రుద్ది బురదజల్లాడనుకోవడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. కౌన్సిల్ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందులలో ఇంటి పన్ను వసూలు చేసే సిబ్బంది డబ్బులు వసూలుచేసి నకిలీ బిల్లులు ఇస్తున్నారన్నారు. అందుకు సాక్ష్యం తానే అన్నారు. రూ.6300 డబ్బులు చెల్లించినా ఇంత వరకు అప్‌డేట్ కాలేదన్నారు. అలాగే జూన్ 12 వరకు లైట్లు బాగా వెలిగాయని, తర్వాత లైట్లు వెలగకపోవడం వెనుక పాలకుల నిర్లక్ష్యం ఉందన్నారు.

## ప్రత్యేక హోదాపై బీజేపీది పలాయన వాదం

- తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై బీజేపీది పలాయన వాదమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి మండిపడ్డారు. గురువారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా భిక్ష కాదు హక్కు అన్నారు. ప్రత్యేక హోదా మౌఖిక హామీ మాత్రమే అని, రాతపూర్వక హామీ కాదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హైకోర్టులో వాదించడం సిగ్గుచేటని మండిపడ్డారు. పదేళ్ల పాటు ప్రత్యేక హోదా అమలు చేస్తామని తిరుపతి ఎన్నికల సభలో కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి స్వామి సాక్షిగా నరేంద్ర మోదీ చెప్పారన్నారు. ఇప్పుడు రాతపూర్వక హామీ ఇవ్వలేదని సాకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. అలాగే రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య లాలూచీ కుస్తీ నడుస్తోందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో సౌర విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో రూ.1750 కోట్ల అవనీతి జరిగిందని అమెరికా ప్రభుత్వ సంస్థలు ఆధారాలతో సహా కోర్టులో కేసులు వేశాయన్నారు. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం ఒప్పందాలు రద్దు చేసుకోదు, విచారణ ఉండదు, చర్యలు తీసుకోదన్నారు. రాష్ట్రంలో అంతిభద్రతల పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. ఆర్టీపీపీ బూడిద కోసం కూటమి నాయకుల మధ్య యుద్ధం ఇందుకు ప్రబల నిదర్శనమన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వేమా రాజా తదితరులు పాల్గొన్నారు.

# మహర్దశ వచ్చేనా...

- వైసీపీ పాలన రైతులకు శాపం
- ఐదేళ్లుగా కుంటలు, చెరువులు అభివృద్ధికి దూరం
- డిసెంబరు 8న నీటి సంఘం ఎన్నికలు
- పింఛా ప్రాజెక్టు, నాలుగు చెరువులకు ఎన్నికలు


కృష్ణారెడ్డి చెరువు, మొరవకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు


పింఛా ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి వృథా అవుతున్న నీరు

సుండుపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు పరిధిలోని చెరువులకు వైసీపీ ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. సుండుపల్లె మండలంలో వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్న చెరువులను పట్టించుకోకపోగా, కనీసం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో యాజమాన్యం లేక దీనస్థితికి చేరుకున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులు, చెరువులు, కుంటల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు కూటమి నేతలు చెబుతున్నారు. అందులో భాగంగా డిసెంబరు 8న పింఛా ప్రాజెక్టు, కృష్ణారెడ్డి చెరువు, గూనేటి వాగుచెరువు, ఊటచెరువు, నారాయణరెడ్డి చెరువులకు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎన్నికల అధికారులుగా తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్ ఏఈ, మండల విద్యాశాఖ అధికారులు 1, 2లు వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. పింఛా ప్రాజెక్టుతో పాటు నాలుగు చెరువుల కింద సుమారు 3,127 మంది ఆయకట్టు రైతులు ఉన్నారు. నీటి సంఘం ఎన్నికలతో ప్రధాన చెరువులు, ప్రాజెక్టుకు మంచి రోజులు రానున్నాయని కూటమి నేతలు, రైతులు చెబుతున్నారు.

### పింఛా ప్రాజెక్టుకు జగన్ పాలన శాపం

యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టుకు జగన్‌మోహన్‌రెడ్డి పాలన శాపంగా మారిందని ప్రాజెక్టు దిగువ భాగంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలుగుదేశం పాలనలో నీటి సంఘం ఎన్నికలు నిర్వహించి, కుడి, ఎడమ కాలువలకు రక్షణ గోడలతో పాటు ఇతర పనులను నిర్వహించారు. ఆ తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి కాలపరిమితి పూర్తయింది. ఆ తర్వాత ప్రాజెక్టు పనుల కోసం ఒక రూపాయి కేటాయించకపోవడం, ప్రాజెక్టు మట్టికట్ట తెగిపోవడం, వంటి కారణాలతో ప్రాజెక్టుతో పాటు కాలువలు దీనస్థితికి చేరుకున్నాయి. ఎడమ కాలువలకు కుర్వపల్లి సమీపంలో రక్షణ గోడలు తెగిపోయి నీరు వృథా అవుతోంది. కుడి, ఎడమ కాలువలపైన పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఇంకా అనేక సమస్యలతో ప్రాజెక్టు కాలువలు రైతులకు సాగునీటిని అందించలేకపోతున్నాయి. త్వరగా కాలువలకు పూర్వ వైభవం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

**డిసెంబరు 8న నీటి సంఘం ఎన్నికలు**

డిసెంబరు 5న మండలంలోని పింఛా ప్రాజెక్టుతో పాటు నాలుగు చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికలలకు నోటిఫికేషన్ విడుదలవుతుంది. డిసెంబరు 8న ఎన్నికలు నిర్వహించనున్నాం. నీటి సంఘం ఎన్నికలు జరిగితే ప్రాజెక్టు, చెరువుల అభివృద్ధికి నిధులు వస్తాయి.

*- నాగేంద్రనాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సుండుపల్లె*

### రూపురేఖలు కోల్పోతున్నాయి

సుండుపల్లె మండల వ్యాప్తంగా 113 చెరువులు, కుంటలుండగా, ప్రధానంగా నాలుగు చెరువులకు నీటి సంఘం ఎన్నికలు జరగనున్నాయి. కొన్ని చెరువుల్లో పిచ్చిమొక్కలు, కంపచెట్లు దర్శనమిస్తున్నాయి. కొన్ని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయి. చెరువులు, కుంటల ఆక్రమణలపైన రెవెన్యూ అధికారులకు కూటమి నాయకులు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఎన్నికలు జరగాల్సిన ఊటచెరువు మొరవకు మరమ్మతులు చేయాల్సి ఉంది. చెరువుకట్టపై కంపచెట్లు పెరిగిపోయాయి. నారాయణరెడ్డి చెరువు, కృష్ణారెడ్డి చెరువు, గూనేటివాగు చెరువులను ఐదేళ్లుగా పట్టించుకోకపోవడంతో రూపు కోల్పోతున్నాయి. కృష్ణారెడ్డి చెరువులో వర్షపు నీరు చేరినా లీకేజీలు రైతులను కలవరపెడుతున్నాయి. పూడిక పెరిగిపోయింది. కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూడిపోయి పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయని స్థానిక రైతులు చెబుతున్నారు.

**ఎవరూ పట్టించుకోవడం లేదు**



ఊట చెరువుకింద ఆరు ఎకరాల భూమి ఉంది. చెరువులో నీరు ఉంటే బోర్లలో నీరు పుష్కలంగా ఉంటుంది. సాగు, తాగునీటి కష్టాలు ఉండవు. చెరువులను ఎవరూ పట్టించుకోవడం లేదు. చెరు వు దగ్గరకు పోయేదానికి దారి కూడా సరిగ్గా లేదు. చెరువు చుట్టూ కంప చెట్లు పెరిగి పోయాయి.

*- కృష్ణయ్యనాయుడు, రైతు, తిమ్మసముద్రం*

**రైతు ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి**



రైతుల ద్రోహిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. రైతులకు ఉపయోగపడే నీటి సంఘం ఎన్నికలకు పక్కన పెట్టి ఐదేళ్ల కాల యాపన చేశాడు. ఝరికోన నుంచి కాలువలు ఏర్పాటు చేసి చెరువులు, కుంటలను నీటితో నింపుతామని చెప్పి సుండుపల్లె ప్రజలను వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు మోసం చేశారు.

*- విశ్వనాథనాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి*

**రైతుల ఘోష జగన్‌కు వినిపించలేదు**



ఎన్నికలకు ముందు తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ప్రాజెక్టులు, చెరువులు, కుంటలను పట్టించుకోలేదు. వేల ఎకరాలకు సాగునీటిని అందించే పింఛా ప్రాజెక్టు దుస్థితికి జగన్ పాలనే కారణం. పింఛా ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి.

*- గాజుల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు*

# 12 మంది స్మగ్లర్ల అరెస్టు

**20 దుంగలు స్వాధీనం : రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్**


పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలతో డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ వరప్రసాద్ తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలం గడికోట రోడ్డులోని ఈడిగపల్లె సమీపంలో అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి 12 మంది స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి గురువారం రాయచోటి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ కృష్ణమోహన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. వీరబల్లి మండలంలోని గడికోట రోడ్డులో గల ఈడిగపల్లికి సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం భగత్‌సింగ్‌కాలనీకి చెందిన గాండ్ల లతీఫ్‌బాషా, తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు జిల్లా అనైకట్ తాలూకాకు చెందిన దేవరాజ్, బలరామయన్, బాబు, దొరైస్వామి, నాగరాజ్, తిరుమన్నామలై జిల్లాకు చెందిన కుమరేషన్, శాంతకుమార్, గోవిందరాజ్, రామస్వామి, శివరాజ్, రామచంద్రన్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ గల 20 దుంగలను, రూ.9 లక్షల విలువ గల ఒక ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పెట్టినట్లు డీఎస్పీ వివరించారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్‌ఐలు మోహన్‌నాయక్, భక్తవత్సలం, శ్రీనివాసులు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రజిని, ఆర్‌ఎస్‌ఐ మురళీధర్‌రెడ్డిలను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.

# మైక్రో ఇరిగేషన్ సాగు పెంచుదాం


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

గుర్రంకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో వ్యవసాయ సాగు పెంచాలని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. గుర్రంకొండ రైతు సేవా కేంద్రంలో గురువారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30 వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. గుర్రంకొండ మండలంలో మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో 900 హెక్టార్లలో వ్యవసాయం సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఇప్పటికి 464 హెక్టార్లకు రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని సిబ్బంది పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో రైతులకు మైక్రో ఇరిగేషన్‌పై అవగాహన కల్పించి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# సంక్రాంతికల్లా గుంతల రహిత రహదారులు

**యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు : జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జనార్దన్‌రెడ్డి**


రాజంపేటలో దెబ్బతిన్న రోడ్ల ఫొటోలను పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

రాజంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్రాంతి నాటికల్లా గుంతల రహిత రహదారులే లక్ష్యంగా పనిచేస్తూ అన్ని ప్రాంతాల్లో రోడ్లను మరమ్మతులు చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం నారావారిపల్లెలో సీఎం సోదరుడు నారా రామ్మూర్తినాయుడు కర్మ వేడుకల్లో పాల్గొని తిరుగు ప్రయాణంలో రాజంపేటకు వచ్చారు. ఈ సందర్భంగా రాజంపేట ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిపై ఫొటో ప్రదర్శన నిర్వహించగా వాటిని మంత్రి తిలకించారు. దెబ్బతిన్న రోడ్ల వివరాలను, గుంతలు పూడ్చే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి మంత్రిని స్వాగతించి ఇక్కడ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అత్తిరాల ప్రాంతానికి, ఆధ్యాత్మిక కేంద్రాలైన తాళ్లపాక మీదుగా రోడ్డు వేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా రాజంపేట టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం సమర్పించారు. అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయాలని, రాజంపేటలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని విన్నవించారు. రాజంపేట భువనగిరిపల్లె ముఖద్వారం వద్ద చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో భారీ గజమాలలు వేసి స్వాగతించి సత్కరించారు. తదనంతరం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, కాకతీయ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు శివకుమార్, రాజంపేట పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్, రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ మండల నాయకులు మేకా నరసింహులు, జిల్లా బలిజసంఘం అధ్యక్షుడు టైల్స్ నరసింహ, ఊటుకూరు మాజీ సర్పంచ్ ఎంఎల్ నరసయ్య, దంతవైద్య నిపుణుడు డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

మదనపల్లె టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం వేంపల్లె, చీకిలబైలు గ్రామ పంచాయతీల్లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. గురువారం వేంపల్లె పంచాయతీ బార్లపల్లె వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న కుమారిని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద 96 టెట్రాప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే చీకిలబైలు గ్రామంలో వెంకటరమణ అలియాస్ సుల్తాన్‌ను అరెస్టు చేసి అతడి వద్ద 28 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండుకు పంపామన్నారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు, కర్ణాటక మద్యం విక్రయాలు, గంజాయి విక్రయాలపై 9440902533 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జబీవుల్లా, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రంగానాయక్, చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సీఐ తల్లి హత్య కేసులో నిందితుడు అరెస్టు



మదనపల్లె అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి పేరం స్వర్ణకుమారి హత్య కేసులో నిందితుడు అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... కోళ్లబైలు పంచాయతీ జగన్ కాలనీలో కాపురం ఉంటున్న స్వర్ణకుమారిని సెప్టెంబరు 28న పూజ నెపంతో నీరుగట్టువారిపల్లెలోని సాయిరాంవీధిలో ఉంటున్న అనిల్‌కుమార్ ఇంట్లో పూజలో ఆమెను కూర్చోబెట్టి తలపై సుత్తితో మోది హత్య చేశారు. ఆమె ఒంటిపైన ఉన్న బంగారు నగలు దోచుకున్నారు. అనంతరం ఆమె మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా అయోధ్యనగర్‌లోని స్మశానంలో పూడ్చివేశారు. ఆమెను చంపడానికి నలుగురు పథకం పన్నారని, అందులో గతంలో ఇద్దరిని అరెస్టు చేయగా ప్రస్తుతం అనిల్‌కుమార్ అనే నిందితుడిని 28వ తేదీ గురువారం నిమ్మనపల్లె క్రాస్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అనిల్‌కుమార్ తల్లిని పోలీసులు అరెస్టు చేయాల్సి ఉంది. కార్యక్రమంలో తాలుకా ఎస్‌ఐ చంద్రమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిపై విచారణ


వైద్యులను విచారిస్తున్న డీసీహెచ్‌ఎస్ బృందం

తంబళ్లపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి పూర్వపు వైద్యాధికారి వెంకట్రామయ్యపై డీసీహెచ్‌ఎస్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ బృందం గురువారం విచారణ చేపట్టింది. తంబళ్లపల్లె సీహెచ్‌సీ వైద్యాధికారిగా వెంకట్రామయ్య ఉన్న సమయంలో అదే ఆసుపత్రిలో పనిచేసే కొందరు వైద్యులు కొన్ని రోజుల కిందట వైద్యాధికారిపై కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టరు ఆయనను డిప్యూటేషన్‌పై బి.కొత్తకోటకు బదిలీ చేయగా అదే ఆసుపత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న తేజశ్వినిని ఇన్‌చార్జి వైద్యాధికారిగా నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్ నేతృత్వంలోని పీలేరు మెడికల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, రాయచోటి ప్రభుత్వాసపత్రి సీనియర్ అనస్థీషియన్ వెంకటశివ బృందం గురువారం తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి విచారణ నిమిత్తం వచ్చారు. తొలుత ఆసుపత్రిలోని నూతన భవనంలో వైద్యులతో సమావేశం నిర్వహించి అనంతరం విచారణ ప్రారంభించారు. ఆసుపత్రిలో పనిచేసే వైద్యులను, నర్సులను, సిబ్బందిని ఒక్కొక్కరిని విడివిడిగా అన్ని అంశాలలో సమగ్ర విచారణ చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ విచారణ రాత్రి వరకు కూడా కొనసాగుతోంది. ఈ విచారణలో వెల్లడైన అంశాలను కలెక్టరుకు అందచేయనున్నట్లు విచారణాధికారులు తెలిపారు. విచారణ నిమిత్తం జిల్లా వైద్యాధికారులు వచ్చారని తెలుసుకున్న ప్రజలు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటేషన్‌పై పంపిన వెంకట్రామయ్యను తిరిగి ఇక్కడే వైద్యాధికారిగా నియమించాలని టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, స్థానికులు విచారణాధికారులకు వినతిపత్రం అందచేశారు. వెంకట్రామయ్య వైద్యాధికారిగా ఆసుపత్రిని ఎంతగానో అభివృద్ధి చేశారని..తంబళ్లపల్లెలోనే నివాసం ఉండి నిరంతరం ఆసుపత్రిని పర్యవేక్షిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించేవాడని అధికారులకు తెలియచేశారు. వైద్యాధికారిపై కక్షతో కొందరు వైద్యులు చేసిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకుని నిరంతరం ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండే వైద్యాధికారి వెంకట్రామయ్యను డిప్యూటేషన్‌పై పంపడం సబబు కాదన్నారు. ఈ అంశాలను కలెక్టరుకు అందచేస్తామని విచారణాధికారులు తెలిపారు.

# అభివృద్ధికి నోచుకోని బౌద్ధారామాలు

**● అతిథిగృహం ప్రారంభమెప్పుడో...!**

నందలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమలోనే అత్యంత చారిత్రాత్మక ఆడపూరు ముక్తికనుమ వద్ద ఉన్న బౌద్ధారామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. దాదాపు కోటి రూపాయలతో నిర్మించిన బౌద్ధారామాల పర్యాటక అతిథిగృహం పూర్తయి దాదాపు 5 సంవత్సరాలు అవుతున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. 2017లో పర్యాటక ప్రాజెక్టు నుంచి రాష్ట్ర పర్యాటకశాఖ బౌద్ధారామాల అభివృద్ధి కోసం రూ.1.30 కోట్లతో శంకుస్థాపన చేసి పర్యాటక అతిథిగృహంలో ధ్యానమందిరం, సమావేశ మందిరంతో పాటు పార్కు, మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగాయి.

అతిథిగృహంలో ప్రత్యేకంగా బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. క్రీ.పూ. 3 నుంచి 11వ శతాబ్దాల మధ్య నందలూరు బాహుదానది ఒడ్డున బౌద్ధారామాలు విరాజిల్లాయని దక్షిణ భారతదేశ పర్యటన చేసిన చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ ప్రపంచానికి తెలియజేశారు. 1977లో అప్పట్లో రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు జరపగా 1979లో ముక్తికనుమపై 21 స్థూపాలు బయటపడ్డాయి.

అయితే అప్పట్లో ప్రభుత్వాలు సరైన ప్రచారాలు నిర్వహించకపోవడంతో బౌద్ధారామాల స్థూపాలకు తగినంత ఆదరణ లభించలేదు. గత ప్రభుత్వాలు వీటిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేసినా నిర్మాణాలలో అలసత్వం, ప్రజలకు వీటిపై అవగాహన కల్పించలేదు. ఇప్పటికైనా పర్యాటకశాఖ వారు అతిథిగృహాన్ని ప్రారంభించి మరిన్ని నిధులతో ప్రచారం చేస్తే సమీపంలోని సౌమ్యనాథ ఆలయం ఉండడంతో తప్పనిసరిగా భక్తులు, పర్యాటకులు బౌద్ధారామాల సందర్శనకు వస్తారని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందేందుకు వీలవుతుందని స్థానికులు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో అరుదుగా ఉన్న ఈ బౌద్ధారామాలను మరింత అభివృద్ధి పరచాల్సిన బాధ్యత పర్యాటకశాఖపై ఉంది.

ఆడపూరులోని బౌద్ధారామాలు




ముక్తికనుమ వద్ద నిర్మించిన బౌద్ధారామాల పర్యాటక అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహం


**చర్యలు తీసుకోవాలి**



భారతదేశంలో గౌతమి బుద్ధుడి స్థూపాలు రెండు రకాలు. బుద్ధుడు మహా నిర్యాణం పొందిన తర్వాత ఆయన అవశేషాలపై నిర్మించినవి శారీరక స్థూపాలు కాగా ప్రత్యేక సందర్భాల్లో నిర్మించినవి ఉద్దేశిక స్థూపాలు. గుంటూరు జిల్లా అమరావతి, కృష్ణాజిల్లా ఘంటసాలలో శారీరక స్థూపాలు నిర్మించగా కడప జిల్లా నందలూరు వద్ద ఉన్న ఆడపూరు గుట్టలో ఉద్దేశిక స్థూపాలను తీర్చిదిద్దారు. ఇప్పటికైనా నందలూరు మండలంలోని చారిత్రక బౌద్ధారామాలను అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతంలో పర్యాటకరంగం వేగం అందుకుంటుంది.

*- డాక్టర్ అరిగె రాంప్రసాద్, నందలూరు.*

**పర్యాటక క్షేత్రాలుగా తీర్చిదిద్దాలి**



మండలంలోని ఆడపూరు ముక్తికనుమల్లోని బౌద్ధారామాలను పర్యాటక క్షేత్రాలుగా తీర్చిదిద్దాలి. అక్కడ కోటి రూపాయలకు పైగా నిధులతో నిర్మించిన అతిథిగృహాన్ని, పార్కును అందుబాటులోకి తేవాలి. చారిత్రాత్మక, ప్రాచీన బౌద్ధారామాలను అభివృద్ధిపరిచి వెలుగులోకి తేవాలి.

*-జంబు సూర్యనారాయణ, సర్పంచ్, నాగిరెడ్డిపల్లె*

## టెక్నాలజీ సాయం

# ఇల్లు 6 అడుగులు పైకి...



కొండాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేడు ఆధునిక టెక్నాలజీ అన్ని రంగాల్లో ఉపయో గపడుతోంది. రోడ్డు విస్తరణలో భాగంగా ఓ ఇల్లు రోడ్డు కంటే అరు అడుగులు తగ్గులోకి వెళ్లింది. దీంతో ఆ ఇంటిని పడగొట్టకుండా నూతన టెక్నాలజీ సాయంతో అధునిక పరికరా లను ఉపయోగించి పైకి లేపుతున్నారు. వివరాల్లోకి వెళితే...

కొండాపురం పట్టణంలో ప్రస్తుతం నాలుగులైన్ల జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కనే ఉన్న సుధీర్‌శ్రేష్ఠి ఇల్లు రహదారి కంటే తగ్గులోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఇదే నివాసంలో అతనికి కిరాణాషాపు ఉండగా తగ్గులో ఉంటే వ్యాపారం జరగదని భావించి.. ఇంటిని పడగొట్టకుండా పైకి లేపాలని నిర్ణయించు కున్నాడు. ఈ పనులను చెన్నైకు చెందిన ఓ సంస్థకు అప్పగించాడు. దీంతో వారు బేస్‌మెంట్ పైభాగం నుంచి ఇంటిని యథాతథంగా పైకి లేపుతున్నారు. బేస్‌మెంట్‌కు, ఇంటికి మధ్యలో పెద్ద పెద్ద జాకీలు ఉంచి, నూతన టెక్నాలజీ, అధునిక పరికరాల సహాయంతో సుమారు 6 అడుగులు పైకి లేపుతున్నట్లు ఇంటి యజమాని తెలిపారు. ఇళ్లు చెక్కు చెదరకుండా ఇంటిని పైకి ఎత్తుతున్నారు. ఈ ప్రక్రియలో కింద పరిచిన బండలు మాత్రమే పక్కకు తీస్తారని తెలిపారు. కాగా సుమారు 6 అడుగుల ఇళ్లు పైకి లేపడానికి సుమారు రూ.15 లక్షల వరకు వ్యయం అవుతోందని తెలిపాడు. కాగా, ఇంటిని యథాతదంగా పైకి లేపడాన్ని జనాలు ఆసక్తిగా చూస్తున్నారు.

# బకాయిలుంటే కనెక్షన్ తొలగించండి

● మొండి బకాయిలకు రెడ్-కోర్టు నోటీసులు ● విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ



విద్యుత్‌శాఖ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

ఎర్రగుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలుంటే వెంటనే కనెక్షన్ కట్ చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ కింది స్థాయి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మొండి బకాయి లున్న వారికి రెడ్ నోటీసులు ఇవ్వాలన్నారు. గురువారం కమలాపురం, ఎర్రగుంట్ల నగరపంచాయతీ, రూరల్ ఏరియాల్లో విద్యుత్ బకాయిల వసూళ్లపై ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. బకాయిలు ఎక్కువగా ఉండడంతో సిబ్బందిపై మండిపడ్డారు. పెద్ద మొత్తంలో బకాయిలుండడం సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోందని, ఇకపై ఎవరినీ ఉపేక్షించమని హెచ్చరించారు. బకాయిల వసూళ్లలో రాజీ వద్దని, దయ చూపించే స్థితిలో సంస్థ లేదన్నారు. విద్యుత్ సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తోందన్నారు. మరొక నెల తర్వాత బిల్లు వసూ లు చేస్తోందన్నారు. వెరసి వినియోగదారులకు రెండు నెలల గడువునిస్తోందన్నారు. నిబంధనల ప్రకారం వారి మీటరు శాశ్వతంగా తొలగించి కోర్టులో దావా వేసి చట్టరీత్యా చర్యలు తీసుకుని విద్యుత్తు బకాయిలు వసూళ్లు చేయాలని సూచించారు. నెలవారి విద్యుత్ బకాయిల వసూళ్ల లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల డిపూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్, ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు చర్యలు

● మెప్మా పీడీ వై.సురేశ్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మెప్మా పీడీ వై.సురేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఆంధ్రజ్యోతిలో అనాధలు, అభాగ్యులకు ఆసరా ఏది అనే శీర్షికపై ఆయన స్పందిస్తూ కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వం నాలుగు బ్యాక్‌వర్డ్ కమ్యునిటీ డెవలప్‌మెంటు సొసైటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే మూడింటికి కాలపరిమితి పూర్తవడంతో వాటిలో ఉన్న నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం జడ్పీ కార్యాలయ ఆవరణలో శ్రీవిజయసేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాశ్రయుల వసతి గృహంలో 50 పడకలతో వసతి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మరొక వసతి ఏర్పాటు చేసేందుకు విద్య చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ముందుకు వచ్చిందని.. దానికి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపించామన్నారు. కార్పొరేషన్ పరిధిలో నిరాశ్రయులకు వసతి కల్పించేందకు అన్ని చర్యలు చేపడతామని చెప్పారు.

## తుఫాన్ ప్రభావం

# నల్లబడ్డ వరిగింజలు

ఆందోళనలో రైతులు.. ఆదుకోవాలని వేడుకోలు



చెన్నూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షం రైతులను నట్టేట ముంచింది. వర్షానికి వరి ధాన్యంలో దాదాపు పాతిక భాగం నల్లగింజగా మారాయి. దీంతో పెట్టిన ఖర్చులైనా వస్తాయా రావో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. చెన్నూరు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో చిన్నమాచుపల్లె, ఉప్పరపల్లె, రామనపల్లె గ్రామాలలో దాదాపు 800 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటికే పలు రెవెన్యూ గ్రామాల్లో కోత దశపూర్తి కాగా ఈ మూడు రెవెన్యూ గ్రామాల్లో గురువారం నుంచి వరి కోతలు మొదలయ్యాయి. కోసిన వరి ధాన్యం తెచ్చి రైతులు కలాల్లో ఆరబోస్తున్నారు. అయితే పండిన వరి ధాన్యంలో ఎక్కువ నల్లగింజలు కనిపిస్తుండటంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. నల్లబడ్డ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదని వాపోతున్నారు. ఈ విషయం వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు కోసిన ధాన్యం పరిశీలించి.. విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామని.. ప్రభుత్వానికి కూడా నివేదికలు పంపి తగిన న్యాయం చేస్తామని చెబుతున్నారు. మరి నష్టపోయిన రైతులకు ఏ మాత్రం న్యాయం జరుగుతుందో చూడాలి.

## జాతీయ పోటీలకు మాసాపేట విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలోని వజ్రకరూరులో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించి అరాఫత్ (10వ తరగతి) జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అంతేగాక ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 సాఫ్ట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో కడప జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి జిల్లా జట్టు నుంచి వెంకటేశ్, బి.భవంత్‌సాగర్ (9వ తరగతి)లు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు తిరుపతి పట్టణంలోని మంగళం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 బేస్‌బాల్ విభాగంలో కడప జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించగా అందులో ఎం.సంతోష్ (9వ తరగతి), బి.సంతోష్ (8వ తరగతి) ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరులో జరిగిన అండర్-17 బేస్‌బాల్ విభాగంలో డి.శివరాం (10వ తరగతి) జాతీ యస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్‌రెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్ సుగవాసి ఆనందబాబు, 1వ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్‌ప్రసాద్‌లు జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు ఉత్తన్న విద్యార్థుల క్రీడా పరికరాల కోసం రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు.

## పోటాపోటీగా సాగిన ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ పోటీలు

ఈస్ట్ గోదావరి, రెస్ట్ ఆఫ్ సెంట్రల్, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్ల విజయం



సాయిశ్రావణ్ (151 నాటౌట్), రేవంత్‌రెడ్డి, (131)

కడప స్పోర్ట్స్ నవంబర్ 28, (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్- 23 మెన్స్ ఇంటర్ జోనల్ ఒన్‌డే క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గురువారం వేర్వేరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లలో ఈస్ట్ గోదావరి జట్టు ప్రకాశం జట్టుపై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అనంతపురం జట్టుపై రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 26 పరుగుల తేడాతో గెలుపొందింది. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టుపై 4వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది. వివరాలిలా..

కేవోఆర్ఎం మైదానంలో ఈస్ట్ గోదావరి-ప్రకాశం జట్ల మధ్యసాగిన మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గిన ప్రకాశం జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 46.2 ఓవర్లలో 286 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో అభినవ్ 92 పరుగులు, రోహిత్ 77 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు విజయానికి అవసరమైన 287 పరుగులను 47.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి సాధించింది. ఇందులో సాయిశ్రావణ్ పరుగుల మోత (151 నాటౌట్) మోగించాడు. దీంతో ఈస్ట్ గోదావరి జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపుసాదించింది.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్-అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 50 ఓవర్లలో 203 పరుగులు చేసింది. ఇందులో కేఎస్ఎన్ రాజు 56 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 37.2 ఓవర్లలో 176 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 26 పరుగుల తేడాతో గెలుపు సాధించింది.


కేఎస్ఆర్ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్- రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్‌నార్త్ జోన్ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 294 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఇందులో హర్షవర్ధన్ 63 పరుగులు, సాయిపూర్ణతేజ 55 పరుగులు చేశారు. రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 45.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసి విజయబావుటా ఎగురవేసింది. ఇందులో రేవంత్‌రెడ్డి 131 పరుగులు చేయడం విశేషం.

## నేటి నుంచి వైవీయూ డిగ్రీపరీక్షలు

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు 29వ తేదీ నుంచి సెమిస్టరు పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ క్రిష్ణారావు వెల్లడించారు. జిల్లాలోని 54 కేంద్రాల్లో 1,3, 5 సెమిస్టర్లకు సంబంధించి 20,819 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు.

మొదటి సెమిస్టరు 8,407 మంది, మూడో సెమిస్టరు 6903 మంది, ఐదో సెమిస్టరు 5509 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిచేందుకు వైవీయూ ఉన్నతాధికారుల మార్గదర్శకంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.






## లౌకిక ప్రజాస్వామ్య భావనలు కలిగిన రచయిత కేతు విశ్వనాథరెడ్డి

కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



మాట్లాడుతున్న కాత్యాయని విద్మహే

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లౌకిక ప్రజాస్వామ్య భావనలు కలిగిన రచయిత కేతు విశ్వనాథరెడ్డి అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రసిద్ధ తెలుగు రచయిత్రి ప్రొఫెసరు కాత్యాయని విద్మహే అన్నారు. వైవీయూ ఆర్ట్స్ బిల్డింగులో ప్రసిద్ధ తెలుగు రచయిత కేతు విశ్వనాథరెడ్డి జీవితం, రచనలపై నా దృష్టిలో పేరుతో సాహిత్య కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్తమాన సామాజిక దుర్మార్గాలను సాంస్కృతిక కోణం నుంచి ఎదుర్కొన్న రచయిత కేతు విశ్వనాథరెడ్డి అన్నారు. కులమత అసంబద్ధాలు, అపోహలు తొలగిపోవాలంటే ఆయన కథలు చదవాలన్నారు. వర్తమాన సమాజానికి అవసరమైన లౌకిక ప్రజాస్వామ్య భావనలు కలిగిన వ్యక్తి అన్నారు. విశ్వనాథరెడ్డి తోటి విద్యార్థులతో స్నేహితంగా మెలుగుతూ జ్ఞాన చైతన్యం చేసేవారన్నారు. రిజిస్ట్రారు పద్మ మాట్లాడుతూ అభ్యుదయ రచయితగా రైతులు, పేదలు పీడితుల పక్షాన నిలిచిన గొప్ప రచయిత కేతు విశ్వనాథరెడ్డి అని తెలిపారు. వైవీయూ తెలుగుశాఖ ప్రొఫెసరు ఎంఎం వినోదిని, ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగం డీన్ ప్రొఫెసరు గంగయ్య, తెలుగుశాఖ ప్రొఫెసరు రమాదేవి, విద్య సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, క్రిష్ణకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.



వల్లూరు వంశీధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కడప నగరంలోని రాజీవ్‌పార్కు వద్ద ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న అభిమానులు, మిత్ర బృందం

## రైస్‌పుల్లింగ్ వ్యాపారం కేసులో ముగ్గురు అరెస్టు

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైస్ పుల్లింగ్ వ్యాపారం పేరుతో మోసం చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. మూలే వెంకటరమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెంగుళూరుకు చెందిన అగలి అపర్ణ, ఆమె భర్త జయశీలన్, అపర్ణ అక్క అరుణకుమారి, స్నేహితుడు రామాంజనేయులు, అపర్ణ కజిన్ సిస్టర్ శోభారాణి, ఆమె కొడుకు విష్ణుకుమార్ రాజులపై కేసు నమోదు చేశామన్నారు. కాగా, అరెస్టు అయిన వారిలో అపర్ణ, అరుణకుమారి, రామాంజనేయులు ఉన్నారు.

## ముగ్గురు గంజాయి విక్రేతలు...

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ రోడ్డులోని రైల్వేబ్రిడ్జి కింద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. కదిరి టౌన్‌కు చెందిన పూల సునీల్‌కుమార్, మహ్మద్‌నయాజ్, బిజినేవాలా చాంద్ బాషాలు గురువారం ఉదయం గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి ముగ్గురిని అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి కేజీ 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండుకు తరలించామన్నారు.

## 'ఆగిపోయిన ఆలయాల పనులు పూర్తి చేయిస్తాం'

పులివెందుల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో ఆగిపోయిన ఆలయాల నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎండోమెంట్ అసిస్టెంటు కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. పులివెందులలో గురువారం ఆయన అంకాలమ్మ తల్లి, వడమటి వీరాంజనేయ, శ్రీమిట్టమల్లేశ్వర స్వామి ఆలయాల హుండీల లెక్కింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధి పనులు ఆగిపోయాయని.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. పులివెందుల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వెంకటరమణ, ఇన్స్‌పెక్టరు కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## పొలతలలో హుండీల ఆదాయం రూ.15 లక్షలు



స్వామివారి హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

పెండ్లిమర్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పొలతల క్షేత్రంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్ తెలిపారు. మల్లేశ్వరస్వామి దేవస్థానంతో పాటు అనుబంధ దేవస్థానమైన పుట్ట ఆంజనేయస్వామి దేవస్థానాల హుండీలను దేవదాయ ధర్మాదాయశాఖ సూపరింటెండెంట్ రమణమ్మ పర్యవేక్షణలో కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్ ఆధ్వర్యంలో లెక్కించారు. మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.14,90,437, పుట్ట ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.34,190 మొత్తం రూ.15,24, 627 ఆదాయం వచ్చిందన్నారు. వీటితో పాటు సుమారు 60గ్రాముల బంగారు, 2.50కేజీల వెండి భక్తులు సమర్పించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ పూజారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## రిమ్స్ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ ఫరూక్



నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ (రిమ్స్) ఏపీ ఎన్నికలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. అధ్యక్షుడిగా రిమ్స్ డాక్టర్ ఫరూక్, కార్యదర్శి ఎస్‌పీఎం అసోసియేట్ ప్రొఫెసరు డాక్టర్ సుబ్బరాయుడు, కోశాధికారిగా జనరల్ సర్జరీ, అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ శ్రీధర్‌రెడ్డిలతో కూడిన కార్యదర్శవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ ఎన్నికలకు సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నూకరాజు ఎన్నికల అధికారిగా ఉన్నారు.

## సంక్షిప్తం

### 'ఉక్కు పరిశ్రమపై స్పష్టత ఇవ్వాలి'

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాయలంలో జరిగిన విలేకరుల సమావేశంలో చంద్ర మాట్లాడుతూ నిత్యం కరవులతో తల్లడిల్లుతున్న రాయలసీమకు కేంద్రమైన కడన జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన పేర్కొన్నారు.

### ధర్నాను జయప్రదం చేయండి

కడప(వినాయకనగర్),నవంబరు28(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు, సాగు భూమి మంజూరు చేయాలని డిసెంబరు 2వ తేదీన పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని గిరిజన సమాఖ్య, దళిత హక్కుల పోరాట సమితి, డప్పు కళాకారుల సంఘం నాయకులు బ్రహ్మయ్య, శంకర్‌నాయక్, మునెయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ వంక, రస్తా, చెరువు, దేవాదాయ, ఇనాం, వక్ఫ్ భూములను కబ్జాదారులకు కట్టబెట్టి వారికి అధికారులు కొమ్ముకాయడం సమంజసం కాదన్నారు. బడుగు, బలహీన వర్గాలపై ప్రభుత్వాల రాజకీయ, ఆర్థిక, సామాజిక వివక్ష వీడాలంటే పోరాటాలే శరణ్యమని వారు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

### ఏపీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :ఏపీజీబీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటగణేశ్, అధ్యాపకులు రామచంద్రారెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

### కార్తీక సమారాధనను జయప్రదం చేయండి

కడప కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భాన్ని పురస్కరించుకుని సమైక్య బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదీ రామాంజనేయపురం సాయిశ్రీనివాస గార్డెన్స్‌లో తలపెట్టిన కార్తీక సమారాధన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సమాఖ్య ప్రతినిధులు శివరావు, కె.గోపీనాథ్, రమణయ్య కోరారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త నండూరి శ్రీనివాసన్ ప్రవచనం ఉంటుందన్నారు. కావున నగరంలోని బ్రాహ్మణులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

### ఆలయాల హుండీలు లెక్కింపు

పులివెందుల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలోని అంకాలమ్మ, పడమటి వీరాంజనేయస్వామి, మిట్టమల్లేశ్వరస్వామి ఆలయాల హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం ఏసీ మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంకాలమ్మ తల్లి దేవస్థాన హుండీ ఆదాయం రూ.206920 కాగా మిట్టమల్లేశ్వర స్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.136 556, పడమటి వీరాంజనేయస్వామి ఆలయంలో రూ.96,041 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఏసీ వివరించారు.

ఈ కార్యక్రమాల్లో రంగనాథ దేవస్థానం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ వెంకటరమణ, అంకాలమ్మ, రంగనాధస్వామి దేవస్థానం ఆలయాల ఛైర్మన్లు తిరుమల శెట్టి వెంకటప్రసాద్, సుధీకర్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

### దేవునికడప సోమేశ్వరస్వామి హుండీ లెక్కింపు

కడప కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవుని కడపలో వెలసిన సోమేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆ ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ. శ్రీధర్, అర్చకులు వై. మురళీజగన్నాథ్, పిచ్చయ్యమూర్తి హాజరయ్యారు. గత జూన్ 24వ తేదీ నుంచి ఈనెల 28 వరకు కానుకల ద్వారా రూ.92, 216 వచ్చినట్లు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కడప సహా య కమిషనర్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎన్.ప్రసాద్, ఆలయ అర్చకులు శివ సత్యకుమార్, సుబ్రహ్మణ్యం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గోశాల ఏర్పాటు అభినందనీయం: కమిషనరు



బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న గోశాలలో గోవులకు ఆహారం అందిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గోవులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలతో గోశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్పొరేషన్ కమిషనరు మనోజ్ రెడ్డి అన్నారు. గురువారం బుగ్గ అగ్రహారం వద్ద బుగ్గమల్లేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోశాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోవులకు అవసరమైన ఆహారం అందించేందుకు 12 మంది సిబ్బంది అక్కడ పనిచేస్తున్నారన్నారు. గోవుల ఆరోగ్య పరిరక్షణకు ఇద్దరు వెటర్నరీ అసిస్టెంట్లు కూడా అందుబాటులో ఉన్నారన్నారు. కార్పొరేషన్ పరిధిలో రోడ్లపై తిరగడం వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని అలా తిరగే గోవులను గోశాలకు తరలించడమే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో గోశాల నిర్వాహకులు శ్రీరాములు, వెటర్నరీ అసిస్టెంట్లు, గోసంరక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైళ్లలోనూ, రైల్వే స్టేషన్లలోనూ దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్పీఎఫ్ ఐజీ ఆరోమాసింగ్ ఠాకూర్ తెలిపారు. గురువారం కడప రైల్వేస్టేషన్, ఆర్పీఎఫ్ కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు.ఆర్పీఎఫ్ పోస్టును పరిశీలించారు. అక్కడ సిబ్బందిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విధుల్లో తీసుకోవాలసిన జాగ్రత్తలను వారికి వివరించారు. రైల్వేస్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. సిబ్బంది కొరత ఉందని, అయితే రిక్రూట్‌మెంటు జరిగే వరకు ఔట్‌సోర్సింగ్ హోంగార్డ్స్ ఆర్మీ జవాన్లతో డ్యూటీ నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఐపీఎఫ్ శ్రీనివాసులు, ఎస్ఐలు పాల్గొన్నారు.

### చిత్రం చెప్పిన సమస్యకు స్పందన

లింగాల మండలం కామసముద్రం చెరువు వద్ద పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న హైఓల్టేజి విద్యుత్ స్తంభాల గురించి గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో 'చిత్రం చెప్పిన సమస్య' పేరుతో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. లింగాల విద్యుత్ శాఖ ఏఈ రమేష్ వెంటనే స్పందించి తన సిబ్బందితో అక్కడికి వెళ్లి ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టారు.

– లింగాల,(ఆంధ్రజ్యోతి)



### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, జడ్పీ బాలుర హైస్కూల్, బీసీ కాలనీ, చైతన్య ఏరియా, కాపువీధి, మెయిన్‌బజార్, బిడాలమిట్ట ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న సబ్ ఇంజనీర్ శివ దినేష్ తెలిపారు. 8.30గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ ఉండదన్నారు.

# సామాజిక విప్లవ యోధుడు పూలే

● ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి



పూలే వర్ధంతిలో అవ్వారు మల్లికార్జున... పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి.. నివాళులర్పిస్తున్న అమీర్‌బాబు.. అలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): నాటి సమాజంలో పేరుకుపోయిన అంటరానితనం, కులరక్కసి కోరలను కూకటి వేళ్లతో పెకలించిన తొలి సామాజిక విప్లవ యోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఎస్ అమీర్‌బాబు, టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు మాసా కోదండరామ్ కొనియాడారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలోని అమీర్‌బాబు కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పూలే అడుగు జాడల్లో నడుస్తూ బీసీల అభ్యున్నతికి బాటలు వేస్తున్నారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బీసీల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు కేటాయించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆమూరి బాలదాసు, నాయకులు నాసర్ అలీ, కరీముల్లా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

**మహనీయుడు పూలే**

పూలే వర్ధంతి వేడుకలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ఉపాధ్యక్షుడు కళ్యా సుధాకర్ పాల్గొన్నారు. స్థానిక పాతరిమ్స్‌లో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో వర్ధంతి వేడుక నిర్వహించారు.

**ఆదర్శవాది పూలే: అవ్వారు**

కడప మారుతీనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదర్శవాది పూలే అని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ (జేసీవీపీ) జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున కొనియాడారు. తన పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఆ పార్టీ ప్రతినిధులు జయరామ్, మల్లయ్య, క్రిష్ణయ్య, బీసీ మహాసభ నాయకులు పి.వి రమణ, పెంచలయ్య, షిండే భాస్కర్, సంగటి మనోహర్ పాల్గొన్నారు.

**ఆదర్శప్రాయుడు పూలే: అంజద్‌బాషా**

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదర్శప్రాయుడు పూలే అని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మేయరు సురేశ్‌బాబు అన్నారు. వైసీపీ కార్యాలయంలో పూలేకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పూలే అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా నిస్వార్థ జీవితాన్ని గడిపారన్నారు.

**పూలే మార్గంలో నడుద్దాం: లక్ష్మీరెడ్డి**

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే మార్గంలో నడుద్దాం అని టీడీపీ సీనియర్ నేత అలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి అన్నారు. విజయవాడలోని టీడీపీ జాతీయ కార్యాయలంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

**సామాజిక ఉద్యమకారుడు పూలే**

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమకారుడు పూలే అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. కడప ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయనకు నివాళులర్పించారు.

## ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన బీటెక్ రవి... చిన్నగొందిపల్లెలో కొలువైన అంజన్న

వేముల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగొందిపల్లెలో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, టీడీపీ పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవిలు హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు గడియారం కిరణ్‌కుమార్‌రెడ్డి గణపతి పూజ, స్వస్తివాచనం, పంచాంగ వ్యాపాసనం, మేళన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మైసూరారెడ్డి, గంగిరెడ్డి, నందిరెడ్డి చంటి, విశ్వేశ్వర, రామ్‌పుల్లయ్య, శివరాం, హనుమంతురెడ్డి, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం

కమలాపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పడమటవీధిలో వెలసిన అతి పురాతనమైన పాతాళ సోమేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కన్నులపండువగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్)కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

### సీకేదిన్నె మండలాన్ని సమగ్రాభివృద్ధి చేస్తాం



కుల్లాయిబాబు, ఎంపీడీఓ చింతకొమ్మదిన్నె

ఫటాఫట్

సీకేదిన్నె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలాన్ని సమగ్రాభివృద్ధి చేస్తామని ఎంపీడీఓ సీఎం కుల్లాయిబాబు అన్నారు. ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి సహకారంతో జిల్లాలోనే ముందు వరుసలో నిలబెడుతానన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్ ఇంటర్వ్యూలో ఆయన ఆ వివరాలు వెల్లడించారు.

**ప్రశ్న:** మండల అభివృద్ధి అధికారిగా మీ లక్ష్యం ఏమిటి

**జవాబు:** చింతకొమ్మదిన్నె మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నాం. ఇందుకు అందరి సహకారం అవసరం. పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

**ప్రశ్న:** చింతకొమ్మదిన్నె మండలంలో ఎన్ని పంచాయతీలు ఉన్నాయి.

**జవాబు:** మండలంలో మొత్తం 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 12 మంది సెక్రటరీలు అక్కడ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

**ప్రశ్న:** సీసీ రోడ్ల పరిస్థితి..

**జవాబు:** మండలంలో మొత్తం 40 సీసీ రోడ్లు నిర్మాణంలో ఉన్నాయి.

**ప్రశ్న:** సీసీ రోడ్లకు ఎంత ఖర్చు చేస్తున్నారు.

**జవాబు:** సీసీ రోడ్లకు మండలంలో రూ.2.35 కోట్లు ఖర్చు చేసి రోడ్లు వేయిస్తున్నాం.

**ప్రశ్న:** సీసీ రోడ్లు ఎప్పటికి పూర్తి చేస్తారు.

**జవాబు:** మండలంలో సీసీ రోడ్లు డిసెంబరు చివరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

**ప్రశ్న:** డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉంది.

**జవాబు:** మండలంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం. గ్రామాల్లో ఎక్కడా మురుగు నిలువ ఉండకుండా చేస్తాం.

**ప్రశ్న:** పశువుల షెడ్ల నిర్మాణానికి ఎంత ఖర్చు చేస్తున్నారు.

**జవాబు:** మండలంలో 12 పంచాయతీల్లో పశువుల షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఒక్కొక్కదానికి రూ.2.30 లక్షలు వెచ్చిస్తున్నాం. మొత్తం రూ.57.5 లక్షలతో షెడ్ల నిర్మాణం జరుగుతోంది.

**ప్రశ్న:** తాగునీటి కోసం చర్యలు ఏమిటి?

**జవాబు:** రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మండల వ్యాప్తంగా ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం.

**ప్రశ్న:** వితంతు పింఛన్ ఎలా అందుతోంది.

**జవాబు:** భర్త చనిపోయిన వెంటనే భార్యకు పింఛన్ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఎటువంటి జాప్యం లేకుండా అన్ని ఆధారాలు సమర్పిస్తే ఆ నెల నుంచే పింఛన్ అందిస్తాం. మండలంలో మొత్తం 4,776 పింఛన్లు అందిస్తున్నాం. కొత్త పింఛన్లు త్వరలో ఇస్తాం.

**ప్రశ్న:** మండల అభివృద్ధిలో భాగంగా ఇంకా ఏమైనా చర్యలు చేపడుతున్నారా..

**జవాబు:** మండలంలో స్వర్ణ పంచాయతీ వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నాం. ఇంటింటి సర్వేలు చేపడుతున్నాం. ఇలా ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు అందరి సహకారంతో మరిన్ని అభివృద్ధి చర్యలతో ముందుకెళుతున్నాం.

### అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి

కడప మారుతీనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప కేంద్రీయ విద్యాలయానికి మరిన్ని బస్సులను ఏర్పాటు చేయాలని పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు, విజయవాడ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జనార్ధన్ కోరారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రీయ విద్యాలయంలో దాదాపు 800 మంది విద్యనభ్యసిస్తున్నారని, అక్కడికి వెళ్లే బస్సులలో 55 మంది కూర్చోవాల్సిన సీట్లలో 80 మందికి పైగా కూర్చుని కిక్కిరిసి వెళుతున్నారన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

### ఆశాలకిచ్చిన హామీలను నెరవేర్చాలి

కడప మారుతీనగర్, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆశాలకిచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.సుభాషిణి, జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.వేతనాలు రూ.26 వేలకు పెంచాలన్నారు. అంతేకాకుండా రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు, పెన్షన్ కింద రూ.10వేలు, అలాగే రూ.10లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సాధారణ సెలవులు, వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు ఇవ్వాలన్నారు. యూనియన్ జిల్లా నాయకులు శాంతమ్మ, శోభారాణి, అనసూయ పాల్గొన్నారు.

### నేటి నుంచి ఇ-క్రాప్ నమోదు

పులివెందుల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇ-క్రాప్ నమోదు కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, రెవిన్యూ శాఖ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుచేసిన పంటలను ఇ-క్రాప్ ద్వారా నమోదు చేసుకుంటేనే బీమా, పెట్టుబడి రాయితీలు వర్తిస్తాయన్నారు. పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఇ-పట తప్పనిసరి అన్నారు.

**లింగాల:** రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులందరు ఇ-క్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ రమేష్ తెలిపారు. ఇప్పట్ల గ్రామంలో ఇ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.



## ఎకరాకు రూ.కోటి నష్టపరిహారం ఇప్పించండి

వేంపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎకరాకు రూ. కోటి నష్టపరిహారం ఇప్పించాలని టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డికి ఆ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి, గండి మాజీ ఛైర్మన్ రాజారావు, రాజా, కిషోర్ తదితరులు గురువారం వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ చాగలమర్రి-రాయచోటి హైవే రోడ్డు వేంపల్లె పాపాఘ్ని నది పక్కన వేయనున్నారన్నారు. ఇందుకోసం రైతుల నుంచి భూమి తీసుకుంటున్నారన్నారు. దీంతో ఎకరాకు కనీసం రూ.కోటి ఇప్పించాలని వారు కోరారు. ఈ విషయాన్ని టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ద్వారా కలెక్టర్‌ను కలిసి రైతులకు న్యాయం చేస్తామని ఈ సందర్భంగా వారికి ఆయన హామీ ఇచ్చారు.



రఘునాథరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వేంపల్లె నాయకులు, రైతులు

### జన్ ఔషధి కేంద్రం ప్రారంభం



ఔషధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుభాషిణి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డీసీఎంఎస్ ఆధ్వర్యంలో జన్ ఔషధి కేంద్రాన్ని గురువారం జిల్లా సహకార శాఖ అధికారి సుభాషిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రాల్లో లభించే మందులు ద్వారా 50 నుంచి 90 శాతం వరకు తగ్గింపు పొందవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజను కార్పోరేట్ అధికారి సత్యానందం, డీసీఎంఎస్ ఇన్‌ఛార్జ్ బిజినెస్ మేనేజరు ఖాదర్‌వల్లి, సహకారశాఖ డీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



వైద్యపరీక్షలను పర్యవేక్షిస్తున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి నాగరాజు

బద్వేలు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థినీ, విద్యార్థి తప్పనిసరిగా ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు సూచించారు. గురువారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మల్లేశ్, ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేశ్, ఎపిడ్‌మోలజిస్ట్ ఖాజామొహిద్దీన్, వెంకట్రమణ, డాక్టర్లు జె.వినయ్‌కుమార్, శ్రీనివాసులు, శరత్‌చంద్ర, సౌమ్య, హెచ్‌ఎం కరీముల్లా, వెంకటస్వామి, హెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య పాల్గొన్నారు.

### రాచాయిపేట ఉన్నత పాఠశాలలో...

గోపవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాచాయిపేట ఉన్నత పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి నాగరాజు మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ బాల బాలికల సంరక్షణ అధికారి రమేశ్, మండల వైద్యాధికారులు మహేశ్వర్‌రెడ్డి, మురళీ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిగత శుభ్రత చాలా అవసరం

మైదుకూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికీ వ్యక్తిగత శుభ్రత అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రీయ బాల సురక్షలో విద్యార్థులకు వైద్యఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బద్వేలు డివిజన్ వైద్య అధికారి డాక్టర్ మల్లేష్, సుమధుర, పాఠశాల హెడ్ మాస్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

## స్త్రీ విద్యను ప్రోత్సహించిన సంస్కర్త పూలే : ఎమ్మెల్యే

బద్వేలు/బద్వేలుటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్త్రీ విద్యను ప్రోత్సహించిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని వైసీపీ నేతలతో కలిసి ఆమె పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, పార్టీ నగర విభాగం అధ్యక్షుడు బంగారు శీనయ్య, సుందరరామిరెడ్డి, యద్దారెడ్డి, అనిల్‌కుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్ బీసీ నేతలతో కలసి మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పించారు. నాయీ బ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు గురుబ్రహ్మం, వెంకటసుబ్బయ్య, ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

**జమ్మలమడుగులో....**

జమ్మలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా పూలే విగ్రహానికి హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, చంద్రమౌళి, చేనేత కార్మికులు నివాళులర్పించారు.

## 'ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి'

పోరుమామిళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ, వామికొండ, సర్వారాయ సాగర్ ప్రాజెక్టుల పూర్తికి నిధులు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన రెండో మహాసభలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం చంద్రబాబు, నితీష్‌కుమార్‌పై ఆధారపడి పనిచేస్తోందన్నారు. పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు మండలాలకు తాగునీరు అందించే వెలిగొండ రిజర్వాయరు నిర్మాణానికి రూ.800 కోట్లు అవసరం ఉందని, వామికొండ, సర్వరాయసాగర్ నిర్మాణానికి పంటకాల్వల అభివృద్ధికి వెయ్యి కోట్లు అవసరం ఉందన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మనోహర్, ప్రధాన కార్యదర్శి రవి, మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ వృద్ధాప్యం వస్తుంది : ఎస్ఈ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న విద్యుత్ ఎస్ఈ రమణ, అధికారులు

ఖాజీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం ప్రతి ఒక్కరికీ వస్తుందని అందువలన తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విద్యుత్ ఎస్ఈ ఎస్.రమణ అన్నారు. గురువారం ములపాకు సమీపంలోని పునీత లారెన్స్ అనాథ శరణాలయానికి రూ.40 వేలు విలువైన నిత్యావసర సరుకులు అందజేసిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో తల్లిదండ్రులను తమ వద్ద ఉంచుకుని సేవ చేయాలన్నారు. వృద్ధాప్యం ప్రతి ఒక్కరికీ వస్తుందన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సమాజంలో మెలగాలన్నారు. విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం చెన్నూరు సెక్రటరి చలపతి, ఫయాజ్ బేగ్, మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భరణీకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసులరెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్లు భద్రయ్య, నాగరాజు, వినయ్, పాల్గొన్నారు.

# ఈ వంతెనలు ప్రమాద సంకేతాలు



పెద్దముడియం వద్ద రక్షణ గోడలు లేని కుందూ వంతెన

**తరచూ కుందూ వంతెనలపై ప్రమాదాలు ● మరమ్మతులకు నోచుకోని నెమళ్లదిన్నె వంతెన**
**క్షణ క్షణం భయం భయంగా ప్రయాణీకులు ● రక్షణ గోడ నిర్మించాలంటున్న ప్రజలు**

పెద్దముడియం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రవహిస్తున్న కుందూ నది ఆయా గ్రామాల వద్ద వంతెనలపై ప్రమాద సంకేతాలు ఇస్తోంది. మండల కేంద్రం పెద్దముడియం - పాలూరు మధ్య పాత వంతెన, నెమళ్లదిన్నె వంతెన నిత్యం వాహనదారులకు దడ పుట్టిస్తున్నాయి. ఆయా గ్రామాల్లోని వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలులేక ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని వంతెనలపై ప్రయాణిస్తున్న వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద ముడియం వద్ద కుందూ ప్రవాహం ఉధృతంగా ప్రవహించే సమయంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు తదితరాల్లో వెళ్లే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి. ఏ మాత్రం అదుపు తప్పినా వాహనాలు కుందూలో పడి ప్రమాదాలకు గురికావాల్సిందే. నెమళ్ల దిన్నె వంతెన వద్ద కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నెమళ్లదిన్నె వంతెన ముందు భాగం మూడేళ్ల కిందట వరదల సమయంలో కొట్టుకుపోయినా ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదు. మరో వైపు నెమళ్లదిన్నె వంతెన పైభాగం కొన్ని చోట్ల దెబ్బతినింది. అయినా అధికారుల్లో చలనం లేదు. గత్యంతరం లేక వాహన దారులు ప్రయాణాలు సాగిస్తున్నారు.

### నెమళ్లదిన్నె వద్ద తరచూ ప్రమాదాలు

నెమళ్లదిన్నె వద్ద ఇటీవల రెండు మూడు పర్యాయాలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఏడాది కిందట ఓ కాడి ఎద్దులు, రైతు నదిలో పడిపోవడంతో ఎద్దులు మృతి చెందగా, రైతు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటపడ్డాడు. ఇటీవల కుందూ వరదల సమయంలో గ్రామానికి చెందిన ఓ రైతు ద్విచక్ర వాహనంలో వెళుతూ అదుపు తప్పి నదిలో పడ్డాడు. వాహనం వరద నీటిలో కొట్టుకు పోగా రైతు ఈదుకుంటూ బయటపడ్డాడు. ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి వీటికి ప్రధాన కారణం పెద్దముడియం, నెమళ్లదిన్నె వంతెలనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడమే. ఇన్నేళ్లు గడుస్తున్నా ఈ వంతెనలకు అవసరమైన మరమ్మతులు కానీ, రక్షణ గోడలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన అధికార యంత్రాంగం చేయకపోవడం దారుణమని ఆయా వంతెనలపై వెళ్లే రైతులు, ప్రయాణికులు, వాహన దారులు మండిపడుతున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదాలు జరిగితే తప్ప అధికారులు స్పందించరా అంటూ వాహనదారులు ఆగ్రహిస్తున్నారు. నెమళ్లదిన్నె - ఉప్పలూరు మధ్య కేసీ కాల్వపై ఎప్పుడో బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది రక్షణగోడలు లేక ఏ క్షణంలో వంతెన కూలుతుందోనన్న పరిస్థితుల్లో దర్శనమిస్తోంది. కుందూ వంతెనలు, కేసీ కాల్వ వంతెనపై రాత్రిళ్లు వాహనదారులు వెళ్లాలంటే జంకుతున్నారు. కుందూలో వరద ప్రవాహం ఎక్కువైన సమయంలో ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం చోటు చేసుకునే అవకాశం ఉంది. అధికార యంత్రాంగం ఇప్పటికైనా పరిస్థితి గమనించి కుందూ వంతెనలకు అవసరమైన రక్షణ గోడలు నిర్మించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





నెమళ్లదిన్నె వద్ద రక్షణ గోడ లేని కుందూ వంతెన - కేసీ కాల్వపై బ్రిడ్జి...

# బిల్లుల ఆదాకు 'సూర్యాఘర్ యోజన'

### విద్యుత్ ఎస్ఈ ఎస్.రమణ,



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ ఎస్ఈ

జమ్మలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు బిల్లులు తగ్గించుకునేందుకు ప్రధానమంత్రి సూర్యాఘర్ యోజన పథకం అవకాశం అని జిల్లా సూపరింటెండెంట్ ఎస్.రమణ, డీఈ రాజగోపాల్ వినియోగదారులకు సూచించారు. విద్యుత్తు సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో గురువారం విద్యుత్తు వినియోగదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు గృహ వినియోగదారులు బిల్లులు తగ్గించుకునేందుకు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూర్యాఘర్ యోజన ద్వారా సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు కిలో వాట్ సామర్థ్యానికి రూ.30 వేలు, రెండు కిలోవాట్స్ సామర్థ్యానికి రూ.60 వేలు, మూడు కిలోవాట్స్ సామర్థ్యానికి రూ.78 వేలు వంతున ప్రభుత్వం రాయితీ అందిస్తోందన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తానికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు ఇస్తోందని తెలిపారు. కిలోవాట్‌సామర్థ్యానికి సోలార్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని, దీని ద్వారా ప్రస్తుతం నెలకు రూ.1000 వచ్చే బిల్లు సోలార్ ఏర్పాటు తర్వాత రూ.338 తగ్గుతుందన్నారు. జమ్మలమడుగు అసిస్టెంట్ ఇంజనీర్లు, వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పోరుమామిళ్లలో...

పోరుమామిళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తి బిజిలీ యోజన్‌ను సద్వినియోగం చేసు కోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భరణిక్రిష్ణ అన్నారు. విద్యుత్ కార్యాలయ ఆవరణలో సబ్ డివిజన్ పరిధి మండలాల వినియోగ దారులకు సోలార్ విద్యుత్‌తో కలిగే ప్రయోజనాలు, సబ్సిడీ గురించి వివరించారు. పోరుమామిళ్లను సోలార్ మోడల్ విలేజీ (సౌరవిద్యుత్ ఆదర్శ గ్రామం)గా ఎంపిక చేసినందున గృహవినియోగ దారులు ఇళ్లపై సౌర ఫలకాలు ఏర్పాటుతో బిల్లులు తగ్గుతాయన్నారు. నెట్ క్యాంపు అధికారి యల్లారెడ్డి, పోరుమామిళ్ల సబ్‌డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రవిచంద్రశేఖర్, అసిస్టెంటు డిప్యూటీ ఇంజనీరు వెంకటమహేశ్, సోలార్ పవర్ వెండర్స్ పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండండి

దువ్వూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు, మాచనపల్లె, అన్నపుశాస్త్రులపల్లి పరిధిలో జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని తహసీల్దారు అక్బర్‌బాష తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ శిక్షణలో పోలింగ్ అధికారులు అభ్యర్థుల విషయంలో వారి అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కేసీ కెనాల్ ఏఈ పవన్‌కుమార్‌రెడ్డి, అధికారులు అమర్‌నాథ్‌రెడ్డి, శివప్రసాద్, దుశ్యంత్, భాస్కర్, పాల్గొన్నారు.

## ప్రతి పంటనూ నమోదు చేయండి

బి.కోడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో వేసే ప్రతి పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కౌశిక రైతులకు సూచించారు. గురువారం ఐత్రంపేట, మున్నెల్లి గ్రామాల్లో రబీలో సాగు చేస్తున్న పంటలు పరిశీలించారు. ఆమె రైతులతో మాట్లాడుతూ మీ రువేసే పంటను సిబ్బందికి తెలిపి పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని, నష్టపరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ), పంట బీమా, వ్యవసాయశాఖ ద్వారా అమలు చేసే పథకాలు లబ్ధి పొందవచ్చన్నారు. కాబట్టి ప్రతి రైతు తప్పకుండా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు.



## పనిభారం తగ్గించాలని వినతి

చాపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు పనిభారం తగ్గించాలని కోరుతూ గ్రామ కార్యదర్శులు చంద్రశేఖర్, జానకీరాం, శ్రీనివాసులు, సుదర్శన్, ఆంజనేయులు, సమంత, మరో 12 మంది ఎంపీడీఓ వీరకిశోర్‌కు వినతి పత్రం అందించారు. ఎక్కువ పనులు చేయాలని కోరుతోందని ఒత్తిడి తెస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు రకాల ఇంటింటి సర్వేలు, గ్రామసభలు, పన్ను వసూళ్లు, అసైన్డ్ ఎంట్రీలు, జనన, మరణ ధృవీకరణ నమోదులు, పారిశుధ్యం, వీధి దీపాలు, వంటి పనులు చేస్తున్నామన్నారు. రోజూ తలకుమించిన భారమైందన్నారు. ఇంటి వద్దకూడా టెలికాన్ఫరెన్స్ వినాల్సి వస్తోందని, తాము చాలా బాధపడుతున్నామన్నారు.

## మహిళపై హత్యాయత్నం

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాళ్లమాపురం వాసి నిమ్మకాయల రామలక్షుమ్మపై హత్యాయత్నం జరిగింది. గురువారం తెల్లవారు జామున ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేయగా తీవ్రగాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో ఉంది. మెరుగైన చికిత్స నిమిత్తం ఆమెను కర్నూలుకు తరలించినట్లు తెలిపారు. జరిగిన ఘటనపై రూరల్ సీఐ బాలమద్దిలేటి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యాయత్నం కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'టెండర్ల గొడవ కొండారెడ్డికి ఆపాదించడం అవివేకం'

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన పంచాయితీ రాజ్ టెండర్ల విషయం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి, ఆయన కుమారుడు కొండారెడ్డికి ఆపాదించటం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డికి తగదని టీడీపీ నేతలు చింతకుంట కుతుబుద్దీన్, పగిడాల దస్తగిరి, తలారి పుల్లయ్య ఖండించారు. టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో మున్సిపాలిటీలో టెండర్లన్నీ ఏకపక్షంగా మున్సిపల్ వైస్ చైర్మెన్ బంగారెడ్డి కనుసన్నల్లో నడిచేవన్నారు. నేడు ఎవరైనా టెండర్లు వేసుకోవచ్చు కాబట్టే లెస్‌లకు టెండర్లు వేస్తున్నారన్నారు.

## గ్రామాలు ఐక్యంగా ఉండాలి

కలసపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో మహా రుద్రపూజ నిర్వహించారు. స్వామి శరణానంద మాట్లాడుతూ గ్రామాలు ఐక్యంగా ఉండాలన్నారు. ఏ కార్యక్రమం చేయాలన్నా మనసు నిశ్చల స్థితిలో ఉండాలన్నారు. శివనామస్మరణతో మనసు శాంతిస్తుందన్నారు. పల్లెలో ప్రశాంత నిండి ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.





## 'బ్రహ్మంసాగర్' గేట్లకు మరమ్మతులు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ రిజర్వాయరు గేట్లు మరమ్మతులు చేపట్టారు. రిజర్వాయర్ గేటు మరమ్మతులకు గురవడంతో గేట్లను కిందికి దింపడానికి వీలు కాలేదు. దీంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై తెలంగాణ నుంచి నిపుణుల బృందాన్ని పిలిపించి గురువారం కుడికాల్వ గేట్ల మరమ్మతులు చేపట్టారు. రాబోయే రోజుల్లో రైతన్నలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని గంగ అధికారులు తెలిపారు. డిప్యూటీ ఈఈ మురళీమోహన్‌కుమార్, మెకానికల్ జేఈ నాగరాజు, జేఈ సాయిరంగనాథ్, ఏఈఈ నాగరాజు, ఏఈఈ నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో మరమ్మతులు చేపట్టారు.

## ఏపని జరగాలన్నా ఎమ్మెల్యే అనుమతి తప్పనిసరి : ఎమ్మెల్సీ

జమ్మలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఎవరు ఏ పని చేయాలన్నా, జరగాలన్నా ప్రభుత్వ కార్యాలయాల్లో రెవెన్యూ, పోలీసుల వద్దకు బాధితులు వెళ్లి చెప్పాలన్నా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుమతి తప్పనిసరని ఆయన అనుచరులు, ఆయన చెప్పడం దుర్మార్గపు చర్య అని ఇలాంటి దుస్థితి ఎప్పుడూ లేదని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శించారు. వైసీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని అప్పట్లో ప్రచారం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో అమ్మఒడి ఊసేలేదన్నారు. ఇన్ని సమస్యలుంటే కూటమి నేతలు ఆదాయాల కోసం పరుగుతీస్తున్నారన్నారు. వైసీపీ నేతలు దన్నవాడ మహేశ్వరరెడ్డి, గూడెం చెరువు నాగేశ్వరరెడ్డి, కేకేరమణారెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, యోబు, దేవగుడి చంద్రశేఖర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక కార్పొరేషన్‌తో సమస్యలు పరిష్కారం

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా మాజీ సైనికుల సమస్యలు పరిష్కారమౌతాయని మాజీ సైనికోద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోటూరు శంకరరావు తెలిపారు. గురువారం ప్రొద్దుటూరుకు విచ్చేసిన ఆయన మాజీ సైనికోద్యోగుల సంఘం సభ్యత్వ నమోదులో మాట్లాడుతూ ఇన్నేళ్లుగా ఎన్ని ప్రభుత్వాలకు మాజీ సైనికోద్యోగుల సమస్యలు చెప్పినా పట్టించుకోలేదన్నారు. నారాలోకేష్ పాదయాత్ర సందర్భంగా సమస్యలు ఆయన దృష్టికి తెచ్చామన్నారు. ఎన్నికల ముందు ఆయన ఇచ్చిన హామీ మేరకు మాజీ సైనికోద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అబినందనీయమన్నారు. కార్యక్రమంలో రాయలసీమ జోన్ అధ్యక్షుడు చంద్ర మోహన్ రెడ్డి కడప పార్లమెంటు అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ జయశంకర్ పట్టణ నాయకులు నెల్సన్ తదితరులు పాల్గొన్నారు.